క్లుప్తంగా

ముగిసిన గంజిహళ్లి ఉరుసు



గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతులు

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మా బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం గంధం, గురువారం ఉరుసు, శుక్రవారం జియరత్ కార్యక్రమంతో మహోత్సవాలు ముగిశాయి. ఉరుసుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు స్వామి వారి గంధంతో ఊరేగింపుగా దర్గా చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించారు.

ఆక్రమణల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న జేసీబీ

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీనివాసభవన్ నుంచి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకుని ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. శుక్రవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. దుకాణాలు రోడ్డుకు అడ్డుగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేదన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు వాటిని తొలగించినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన మహిళను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

నందవరం : మండలంలోని జోహరాపురం గ్రామంలోని ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో వివాహిత గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన నాగరాజు, జయలక్ష్మి దంపతులు బైక్‌పై తెలంగాణ రాష్ట్రం అయిజ పట్టణానికి బయలుదేరారు. మంత్రాలయం మీదుగా నాగలదిన్నె వైపు బైక్‌పై వెళ్తుండగా నందవరం మండలం జోహరాపురం గ్రామంలోని ప్రధాన రహదారిపై పడిన గుంతల్లో బైక్ అదుపుతప్పింది. దీంతో జయలక్ష్మి అదుపు తప్పి రోడ్డుపై జారి పడి రక్త గాయాలయ్యాయి. స్థానికులు జయలక్ష్మికి ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కులగణ జాబితాల్లో ప్రదర్శించబడిన మాదాసి కురువ, మాదారి కురువల పేర్లను తొలగించాలని కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షుడు సుమాల ఆంథోని,రాజు,గుండప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మాదాసి కురువ,మాదరి కురువల గురించి అసెంబ్లీలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మాట్లడటాన్ని నిరసిస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక మేరకు ఎస్సీ కులగణన జాబితాను ఇటీవల సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ఉంచారన్నారు. గ్రామాల్లో లేని ఆయా కులాలకు ఎస్సీ కుల ధృవ పత్రాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

నేడు ఉరుకుందలో రుద్ర హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద (నేడు) శనివారం రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ హోమంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దేవస్థానం తరఫున వారికి శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫొటో, దేవస్థానం పేరున్న బ్యాగ్, రెండు లడ్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

సెలవు రోజుల్లోనూ కౌంటర్

ఆదోని టౌన్: పట్టణ ప్రజల సౌకర్యార్థం మార్చి నెలలో సెలవు రోజుల్లో కూడా పన్ను వసూళ్ల కౌంటర్ తెరిచే ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం తెలిపారు. ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్ను, నీటి చార్జీలు, లైసెన్సు ఫీజులు, షాపు రూము అద్దెలు చెల్లించి రశీదు పొందవచ్చన్నారు.

సాఫ్ట్‌వేర్ టూ డీఎస్పీ

- ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత విజయగాథ
- మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1కు ఎంపిక
- మహిళలను ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలరని నిరూపణ
- ఐఏఎస్ కావడమే లక్ష్యంగా ముందుకు..
- నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



తండ్రితో ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత

ఆదోని అర్బన్: ఆమె చదివింది బీటెక్. చదువు పూర్తి కాగానే బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. మంచి జీతం.. ఐదు రోజుల పని.. రెండు రోజుల వారం తపు సెలవులు. జీవితానికి ఇంకేం కావాలి. అయితే అవేవీ ఆమెకు సంతోషాన్ని ఇవ్వలేదు. జీవితంలో ఏదో వెలితి. ఏదో సాధించాలనే తపన. ప్రజలు, సమాజానికి ఏదో చేయాలనే కోరిక. ఉన్నత స్థాయికి ఎదగాలి, మంచి పేరు తీసుకురావాలన్న తండ్రి మాటలనే స్ఫూర్తిగా తీసుకుని గ్రూప్స్‌కు సిద్ధమయ్యారు. మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికయ్యారు. తొలి పోస్టింగ్‌లో ఆదోనీ డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఇంతటితో ఆమె ప్రయాణం ఆగలేదు. ఐఏఎస్ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మహిళలను ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలరనే మాటలకు ఉదాహరణగా నిలిచారు. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెపై ప్రత్యేక కథనం.

సొంతూరు మదనపల్లె

మర్రిపాటి హేమలత సొంతూరు మదనపల్లె. అక్కడే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించారు. ఇంటర్మీడియెట్ తిరుపతిలో ముగించుకుని, మదనపల్లెలో 2017లో బీటెక్ పూర్తి చేశారు. మూడేళ్ల పాటు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేశారు. ఆమెకు చెల్లెలు జ్యోతి సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఉన్నారు.

తండ్రి మాటలే స్ఫూర్తి

ఉమ్మడి చిత్తూరు (ప్రస్తుతం అన్నమయ్య) జిల్లా మదనపల్లెలో తల్లిదండ్రులు హరికృష్ణ, లక్ష్మిదేవి ఒక చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. తల్లిదండ్రులు వీరిద్దరికి ఎంతో ప్రోత్సాహం అందించారు. కష్టపడి చదవాలి, ఉన్నత స్థాయికి ఎదగాలి, మంచిపేరు తెచ్చుకోవాలి, మా పేరును నిలబెట్టాలి అని తండ్రి చెప్పిన మాటలతోనే తాను ఇంతటి స్థాయికి చేరుకున్నానని హేమలత తెలిపారు. తన చెల్లెలు కూడా సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

మొదటి ప్రయత్నంలోనే విజయం

ప్రభుత్వ రంగంలో ఏదైనా సరే ఉద్యోగం చేసి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే గ్రూప్స్ రాయాలని నిర్ణయించుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ప్రజలకు సేవచేసే భాగ్యం ఉండదని ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఏడాదిన్నర పాటు గ్రూప్స్–1 కోచింగ్ తీసుకున్నారు. పట్టుదలతో కష్టపడి చదివి గ్రూప్–1 రాశారు. మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీ ఉద్యోగం సాధించారు. పట్టుదల, సహనం కోల్పోకుండా లక్ష్యాన్ని నిర్ణయించుకుని విజయం సాధించారు.

ఆదోని డీఎస్పీగా పోస్టింగ్

2022 సెప్టెంబర్‌లో డీఎస్పీగా ఎంపియ్యారు. శిక్షణ పూర్తి చేసుకుని ఈ ఏడాది జనవరి 20న బాధ్యతలు తీసుకున్నారు. ఆదోని పట్టణంలో మొట్టమొదట మహిళా డీఎస్పీగా శివోమోషీబాజ్‌పేయ్ పని చేయగా రెండో మహిళా డీఎస్పీగా హేమలత బాధ్యతలు స్వీకరించారు.

జాబ్ చేస్తూనే ఐఏఎస్‌కు సన్నద్ధం

ప్రస్తుతం డీఎస్పీగా ఉంటూ ఐఏఎస్‌కు హేమలత సన్నద్ధమవుతున్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు అని నమ్ముతూ ముందుకెళ్తున్నారు. ఆమె ఐఏఎస్ లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షిద్దాం.

రైతుల అభ్యున్నతికి కృషి చేసిన అధికారులకే గుర్తింపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సాగు నీటిశాఖలో పని చేసే ఇంజినీరింగ్ అధికారులు రైతుల అభ్యున్నతికి కృషి చేసే వారికే రైతుల్లోనూ, ఆ శాఖలో మంచి గుర్తింపు లభిస్తుందని వారందించిన సేవలను రైతులు ఎన్నటికీ మరిచిపోరని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. హంద్రీనీవాలో డీఈఈగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లక్ష్మణ్ కుమార్‌ను శుక్రవారం పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యేతో పాటు టీటీడీ బోర్డ్ మాజీ సభ్యుడు రాంపురం వై. సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ పరిషత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, ఎస్సార్‌బీసీ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి ఆయనను సత్కరించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ డీఈఈగా లక్ష్మణ్‌కుమార్ జిల్లాలో ఎల్లెల్సీ, జీడీపీలో సాగు నీటి పారుదలలో రైతులకు మంచి సేవలందించారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఈఈలు శైలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డీఈఈలు విద్యాసాగర్, విజయ్‌కుమార్, ఏఈలు రవికుమార్, మణికంఠ, రామాంజనేయులు, ఉదయ్‌భాస్కర్‌తో పాటు పలువురు డీఈలు,ఏఈలు,రైతులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జడ్జిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే మహిళాభ్యున్నతి సాధ్యమవుతుందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.హేమ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా శుక్రవారం స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో బూదూరు సుజనా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి విద్యార్థినిలనుద్దేశించి మాట్లాడారు. స్త్రీ లేకపోతే సృష్టే లేదన్నారు. భారతీయ సంప్రదాయంలో స్త్రీని ఆదిపరాశక్తిగా భావిస్తారని తెలిపారు. మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జడ్జిని కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకె.గురురాజారావు, న్యాయవాదులు విమల, జబితాజ్, మురళీకృష్ణ, యేసేపు, శ్రీనివాసులు,నబిరసూల్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికే మెంటల్ హెల్త్ కౌన్సిలర్



మాట్లాడుతున్న డాక్టర్ ఛాయంద్ర కుమార్

గోనెగండ్ల: పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికే కేరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్‌ను ప్రభుత్వం నియమించిందని రాష్ట్ర సమగ్ర శిక్ష పీఎంయూ కోఆర్డీనేటర్ డాక్టర్ ఛాయంద్ర కుమార్ తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో కేరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సుచరిత పనితీరును శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ప్రతి వారం ఒక స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పరీక్షలపై భయం, ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక సమస్యలతో పాటు మొబైల్ గేమ్స్ అడిక్షన్ తదితర సమస్యలను గుర్తించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆరోగ్యవంతులుగా చేస్తారని చెప్పారు. అలాగే విద్యార్థుల్లో సహజ సామర్థ్యాలను గుర్తించి జీవితంలో స్థిరపడటానికి వివిధ రకాల కోర్సులపైన అవగాహన కల్పిస్తారన్నారు. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లా హాజరు శాతం పెంచడానికి కృషి చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 నీలకంఠ, ప్రిన్సిపాల్ విద్యావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

నందవరం : రేషన్ కార్డులో ఉన్న సభ్యులు డీలర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డులో ఈ-కేవైసీ పూర్తికానీ సభ్యుల పేర్లతో జాబితా ఆయా గ్రామాల డీలర్లకు అందించామన్నారు. జాబితాలో పేర్లు ఉన్న సభ్యులు డీలర్ల వద్ద ఉన్న ఈ-పాస్ మిషన్ ద్వారా ఈ-కేవైసీ చేయాలని సూచించారు. మండలంలో ఈ-కేవైసీ లేని వారు 8,318 మంది ఉన్నారని, అందులో ఉన్న ప్రతి ఒక్కరికీ డీలర్లు ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేయించాలని చెప్పారు. ఆర్ఎస్‌డీటీ మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపు గురుసుబ్బారూఢ స్వామి రథోత్సవం



ఊరేగింపునకు ముస్తాబైన రథోత్సవం

కోసిగి: మండల కేంద్రం కోసిగి రంగప్ప గట్టు సమీపంలో వెలసిన గురుసుబ్బారూఢ స్వామి 62వ మహా రథోత్సవం ఈనెల 9వ తేదీన జరుగనుంది. పాల్గుణ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఆదివారం వేకువజామున నుంచి ఆలయ కమిటీ కార్యదర్శులు మఠం చంద్రయ్య, బొంబాయి దయాల ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణ, వెండి కవచ అలంకరణలు చేస్తారు. మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేసి సాయంకాలం ఆలయం నుంచి పెండేకల్లు ఆంజనేయ స్వామి దేవాలయం వరకు మల్లికార్జున స్వామి పల్లకోత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవ మూర్తిని రథంపై కొలువుంచి అశేష భక్తజనం మధ్య ఊరేగిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భవిష్యవాణి భక్తులకు వినిపిస్తారు. రథోత్సవం సందర్భంగా రాత్రి భజన పాటల, భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆదోని రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 10వ తేదీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు తిప్పన్న, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సీనియర్ అధికారి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. వేతనాలు పెంచుతామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలు కరుణ, శశికళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధనమ్మ

అంగన్‌వాడీల సమస్యలపై పోరుబాట

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వంపై పోరుబాట పట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఇందుకోసం ఈనెల 10వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమెతో పాటు యూనియన్ అర్బన్ నాయకులు నాగలక్ష్మి, శైలజ, సీఐటీయూ నాయకులు రాముడు మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్లకు కనీస వేతనం రూ.25వేలు, గ్రాట్యూటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

10న స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 10వ తేదీ ఆదోని అవోపా, ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఆరు నెలల నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. 9849478178 నంబర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని పలు సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం తెలిపారు. డీ2, డీ3 ప్రాంతాలైన శ్రీనివాస్ భవన్ నుంచి ఆలూరు రోడ్డు, మాధవరం రోడ్డు, బోయగేరి, వాల్మీకి నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే డీ1 ప్రాంతాలైనా శ్రీనివాస్ భవన్ నుంచి ఆస్పరి రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

దొంగ పట్టివేత



కాలనీవాసులు చెట్టుకు కట్టేసిన దొంగ

ఆదోని రూరల్: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను కాలనీవాసులు పట్టుకుని, చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదోనిలో శుక్రవారం చోటు చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పట్టణ శివారులోని వైఎస్ఆర్ కాలనీలో మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న గూళ్యం రమేష్ ఇంట్లోకి గుర్తు తెలియని దొంగ శుక్రవారం చొరబడ్డాడు. రమేష్ భార్య రామలింగమ్మ తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోతే చూపించేందుకు ఇంటికి తాళం వేసి తాళాలను బాత్ రూమ్‌లో పెట్టి ఆసుపత్రికి వెళ్లింది. గమనించిన దొంగ తాళాలను తీసుకుని బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారాన్ని చోరీ చేసుకుని ఎత్తుకెళ్తుండగా కాలనీవాసులు గమనించి పట్టుకుని, చెట్టుకు కట్టేశారు. తాలూకా పోలీసులకు దొంగను అప్పగించారు. రామలింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, దొంగ వివరాలు, ఇతర విషయాలు దర్యాప్తులో తేలిన అనంతరం తెలియజేస్తామని తాలూకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

గుడికల్ చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు



గుడికల్ చెరువును పరిశీలిస్తున్న కమిషనర్, ఎంపీడీఓ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ మంచినీటి అవసరాల కోసం ఉపయోగపడుతున్న గుడికల్ చెరువులోని నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ బంగారమ్మ సంబంధిత అధికారులతో కలిసి గుడికల్ చెరువును ఆయన పరిశీలించారు. అయన మాట్లాడుతూ చెరువులోని నీరు కలుషితం కాకుండా ఉండేందుకు మురుగు నీరు చెరువులోకి వెళ్లకుండా డ్రైన్ నిర్మాణం కోసం పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో మంచి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు చెరువుతో పాటు సమ్మర్ స్టోరేజిలో నీటి నిల్వ చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌కుమార్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

లింగ వివక్షతను రూపుమాపుదాం

పెద్దకడబూరు: ఆధునిక సమాజంలో లింగ వివక్ష సరికాదని, దీనిని రూపుమాపాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రధానోపాధ్యాయురాలు ఉమారాజేశ్వరి అన్నారు. మండల కేంద్రం పెద్దకడబూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వంట ఏజెన్సీ మహిళలకు పూలమాలలు వేసి సత్కరించారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని సెంట్రల్: విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎస్పీ హేమలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో అమ్మాయిల విద్య–సమాజ అభివృద్ధి అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారిస్తే వారి కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా ఇంటర్నెట్, సోషల్ మీడియాలతో జాగ్రతగా ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కరస్పాండెంట్ మురళీబాబు, పాల్గొన్నారు.

- ఆదోని అర్బన్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సంయుక్తంగా శుక్రవారం శ్రీగట్టు మల్లయ్యశెట్టి ప్రభుత్వ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాయి. బాలికలకు ‹మహిళా శక్తి› అనే అంశంపై వ్యాసరచన పోటీలు, చదరంగం పోటీలు నిర్వహించి ఆ సంఘం అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి దాత ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో కంటి అద్దాలను పంపిణీ చేశారు.

స్టేట్ బ్యాంక్ ఎదుట నిరసన

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఎదుట ఖాతాదారులు, సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. రెండో అంతస్తులో బ్యాంక్ ఏర్పాటుతో ఖాతాదారులు ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు మెట్లు ఎక్కి దిగ లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. గురువారం బ్యాంక్ పనిపై వచ్చిన అంజలి అనే గర్భిణి మెట్లు ఎక్కడంతో బ్యాంక్‌లోనే రక్తస్రావం జరిగి బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదని, ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బ్యాంక్‌ను కింద ఏర్పాటు చేయాలని మేనేజర్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు.

10న బసవేశ్వర స్వామి రథోత్సవం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురంలో బసవేశ్వర స్వామి రథోత్సవం ఈనెల 10వ తేదీన జరుగనుంది. 12వ తేదీ సుంకులమ్మ దేవర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రథోత్సవం, దేవర ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని గ్రామ పెద్దల వైఎస్సార్ సీపీ నేత వై. సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలను వారి స్వగృహాల వద్ద వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

యంత్రాలతో పనులు చేస్తే చర్యలు



పొనకలదిన్నెలో జేసీబీతో చేసిన ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ పుల్లయ్య

సాక్షి ఎఫెక్ట్

నందవరం : వలసల నివారణకు, వ్యవసాయ, ఉపాధి కూలీలకు జీవనోపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి పనులను యంత్రాలతో చేయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ పుల్లయ్య హెచ్చరించారు. పొనకలదిన్నె గ్రామంలో ఉపాధి పనులను జేసీబీలతో చేయిస్తున్నారని గురువారం ‹తమ్ముళ్లా..మజాకా› అనే సాక్షి వార్తకు స్పందించి ఎంపీడీఓ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టి ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలల హాజరు, ఫారం పాండ్ పనులను తనిఖీ చేశారు. కూలీలను ఆడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..మూల్లా ఖాజావలి అనే రైతు పొలంలో ఫారం పాండ్ పనులు జేసీబీతో చేయించారని, అయితే ఉపాధి కూలీలే మట్టి తవ్వడానికి గట్టిగా ఉందని జేసీబీతో తవ్వించామని వివరించినట్లు తెలిపారు. గ్రామంలోని మేట్ తిరుమల రెడ్డికి చెందిన గ్రూపునకు ఉపాధి పనులు కల్పించొద్దని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. యంత్రాలతో తవ్విన ఫారం పాండ్ పనుల నివేదికను ఉన్నాతాధికారులకు నివేదిస్తున్నట్లు చెప్పారు. ఏపీఓ శ్రీనివాసులు, టీఏలు పాల్గొన్నారు.

పరీక్షల భయం వీడండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష పీఎంయూ రాష్ట్ర కోఆర్డినేటర్

కోసిగి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలపై భయం వీడి ప్రశాంతంగా చదవాలని, అప్పుడే మంచి మార్కులు వస్తాయని సమగ్ర శిక్ష పీఎంయూ రాష్ట్ర కోఆర్డినేటర్ ఛాయింద్రీకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సమక్షంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎలా రాయాలనేదానిపై అవగాహన కల్పించారు.